క్లుప్తంగా

చెన్నూరు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన నంది బాలోత్సవ్ పోటీల్లో చెన్నూరు గ్రామానికి చెందిన ఎంపీయూపీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఉపాధ్యాయులు రాముడు, వెంకటాద్రినాయుడు తెలిపారు. శుక్రవారం వారు విద్యార్థులను అభినందించారు.

చెత్తను కేంద్రాలకు తరలించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): గ్రామాల్లోని చెత్తను కేంద్రాలకు తరలించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఏర్పాటైన చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డీ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం


నంద్యాల(అర్బన్): ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని పలువురు దళిత రైతులు కోరారు. శుక్రవారం నంద్యాల మండలం భీమవరం, బ్రాహ్మణపల్లె, కానాల, రాయమాల్పురం గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు. 20 ఏళ్లుగా ప్రభుత్వ సీలింగ్ భూముల్లో పంటలు సాగు చేసుకుంటూ జీవనాధారం పొందుతున్నామని, నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన తమకు పాసు పుస్తకాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ మాజీ మెంబర్ రాజు, రైతులు వెంకటేశ్వర్లు, పోలయ్య, రాయుడు, మరియమ్మ పాల్గొన్నారు.


వలసలు నివారించాలని జేసీకి వినతి


జేసీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో వలసలు నివారించి వ్యవసాయ పనులు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబా ఫకృద్దీన్, రాధాకృష్ణ, ప్రతాప్, శ్రీనివాసులు, ఉదయ్, మనోజ్, కరీమ్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఏర్పాటు


జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్


జిల్లా కార్యదర్శి నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): రెండు రోజులుగా జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మహాసభల అనంతరం శుక్రవారం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు రణత్‌యాదవ్, కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరవాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేంత వరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మహేష్, విష్ణువర్ధన్, విజయ్, మధు, ప్రకాష్ తదితరులను ఎన్నుకున్నారు.

రేపు ట్రాక్టర్, బైక్ ర్యాలీ

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26న నిర్వహించనున్న ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కార్మిక రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు రాజశేఖర్, నాగరాజు, ఏసు రత్నం, తోట మద్దులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ర్యాలీని రైతులు, కార్మికులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పరీక్షా కాలం ...ఆరోగ్యం భద్రం

- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- ప్రణాళికలతో పాఠాల మననం చేసుకోవాలని నిపుణుల సూచన
- తగినంత నిద్ర .. సమతుల ఆహారం అవసరం

నంద్యాల నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు
గోస్పాడు	5	407
నంద్యాల	7	472
నంద్యాల పట్టణం	74	5,256


గోస్పాడు మోడల్‌స్కూలులో ప్రత్యేక తరగతుల ద్వారా చదువుకుంటున్న విద్యార్థులు

గోస్పాడు: ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల కాలం ప్రారంభమైంది. ఇప్పటికే పదో తరగతి పరీక్షలకు టైంటేబులు విడుదల చేశారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రస్తుత కాలం విద్యార్థుల ప్రతిభకు మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా పరీక్ష పెడుతుంది. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు పాఠ్య పుస్తకాలు చదవడంతో పాటు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. పరీక్షలు అనగానే సాధారణంగా విద్యార్థులపై ఒత్తిడి ఉంటుంది. దీనిని అధిగమించేందుకు, చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా ఉండేందుకు ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. ప్రణాళికతో చదవడంతోపాటు సమయానికి సమతుల ఆహారం తీసుకోవడం, కంటి నిండా నిద్రపోవడం చాలా ముఖ్యమని చెబుతున్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు ఆహార నియమాలు పాటిస్తేనే ఏకాగ్రత, ఆరోగ్యం లభిస్తాయని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 86 పాఠశాలల్లో 6,135 మంది పది విద్యార్థులు ఈఏడాది పరీక్షలకు హాజరు కానున్నట్లు విద్యాధికారులు చెబుతున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. టీ, కాఫీలకు దూరంగా ఉండాలి. సాత్విక ఆహారం, పండ్లు, త్వరగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకుంటే మంచిది. దీని వల్ల చదువుపై ఏకాగ్రత పెరిగి అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చు. రాత్రి వేళ నిర్ణీత సమయం వరకు మాత్రమే చదవాలి. ప్రతి రోజు 8 గంటల నిద్ర అవసరం. ఉదయమే లేచి చదువుకోవాలి. దీనివల్ల చదివిన అంశాలు ఎక్కువగా గుర్తుంటాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ ఉండాలి. విద్యార్థిపై ఒత్తిడి తగ్గించాలి.
– సుదర్శన్‌బాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, నంద్యాల

విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు



విద్యార్థులు వేళకు ఆహారం తినేలా, కంటి నిండా నిద్ర పోయేలా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఇతర విద్యార్థులు చదువుతున్నప్పుడు హేళన చేయడం, వారితో పోల్చి బాధ పెట్టడం, మనసు గాయపరిచేలా మాట్లాడటం చేయరాదు. పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. వారిపై ఒత్తిడి పెంచరాదు. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లిదండ్రులు తరచూ మాట్లాడాలి. చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యపరమైన ఇబ్బందులేవైనా తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్యం బాగుంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించగలరు.
– వెంకటరమణ, డీఎంహెచ్ఓ, నంద్యాల

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలుచేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్రణాళిక ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే విద్యార్థులకు అన్నిరకాలుగా శిక్షణ ఇస్తున్నాం. ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – అబ్దుల్‌కరీం, ఎంఈఓ

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాహుః కాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలకు విశేష స్పందన

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు, నేలంపాడు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పశు వైద్యాధికారి సాయిబాబా మాట్లాడుతూ గేదెలకు, ఎద్దులకు, గొర్రెలకు, మేకలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేసి మందులను అందజేస్తున్నామన్నారు. మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించామన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు రవీంద్రారెడ్డి, దీపాకుమారి, వీఎల్ఓ మురళి, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

ఆలమూరులో పండగ సందడి


ఆలమూరులో పూజలందుకున్న ఉత్సవ మూర్తులు


ఆలమూరులో బండలాగుతున్న వృషభాలు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో పార్వేట ఉత్సవ మూర్తుల పల్లకీ రాకతో గ్రామంలో పండగ సందడి నెలకొంది. ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి అహోబిలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సకుటుంబ సపరివార సమేతంగా తరలిరావాలని పిలుపునిచ్చేందుకు స్వామివారి పల్లకీ ఆలమూరు చేరుకుంది. రెండో రోజు గ్రామంలోని పలు కాలనీలల్లో తిరిగి తెలుపులపై కొలువు దీరడంతో గ్రామంలోని ప్రతి కుటుంబం కొత్త పాత బంధువులతో కలిసి కాయా కర్పూరం సమర్పించారు. భక్తులు అందించిన పూజా సామగ్రిని వారు స్వామి వారికి సమర్పించి సెటారుతో ఆశీర్వదించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు వినోదం కల్పించే దిశగా గ్రామస్తులు వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేత వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు. మహిళల కోసం గాజులు, చిన్నారుల కోసం బొమ్మలు, యువకుల కోసం రంగుల రాట్నం, జారుడు బల్ల వంటివి గ్రామంలో ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


హెల్మెట్లు ధరించి ర్యాలీ చేస్తున్న సీఐ ఎస్ఐ

శిరివెళ్ల: హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని సీఐ వంశీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలో పోలీసులు హెల్మెట్‌లు ధరించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడ వల్ల ఎక్కువ మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. ఇకపై హెల్మెట్ ధరించని వారిపై జరిమానాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

- చాగలమర్రి: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చాగలమర్రి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. మోటార్ సైకిళ్లపై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తూ, వాహనదారులు హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

నంద్యాల(న్యూటౌన్): భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ పరిరక్షణ కమిటీ నాయకులు యాగంటీశ్వరప్ప కోరారు. శుక్రవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, యూత్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: ఈనెల 22, 23వ తేదీలలో నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో నిర్వహించిన నంది బాలోత్సవ్ మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గణిత ఉపాధ్యాయుడు వెంకటచంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజనకు బహుమతులు దక్కాయి. అలాగే ఈ నెల 26న జిల్లా కేంద్రంలో జరిగే గణతంత్ర వేడుకలకు విద్యార్థుల ప్రదర్శన ఎంపికైంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈఓ జనార్దన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కాగా విద్యార్థులను శుక్రవారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

గురురాజ విద్యార్థులు..

నంద్యాల(న్యూటౌన్): నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ద్వితీయ నంది బాలోత్సవ్ పోటీల్లో గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు.

ప్రతి ఆడబిడ్డ ఉన్నత చదువును అభ్యసించాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శశికళ

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఆడబిడ్డ ఉన్నత చదువును అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. శుక్రవారం నంద్యాల డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. బాలికా విద్య, ఆరోగ్యం, శుభ్రతపై అవగాహన కల్పించారు. కౌమారదశలో వచ్చే ఆరోగ్య సమస్యలను, ఆహార మార్పులు, జాగ్రత్తలను డాక్టర్ దివ్య వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

- నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
- శిరివెళ్ల: యర్రగుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బాలికా దినోత్సవంలో సీడీపీఓ తేజస్విని, సూపర్‌వైజర్ సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.
- రుద్రవరం: కేజీబీవీలో ప్రత్యేక అధికారి లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లక్ష్మీదేవి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.
- ఉయ్యాలవాడ: జాతీయ బాలికల దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికల చట్టాలపై సర్పంచ్ మేకల ఓబులేస్ అవగాహన కలిగి కల్పించారు.
- చాగలమర్రి: శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, రజని, రెహాన తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి అస్వస్థత

చాగలమర్రి: కదిరిపురం తండాకు చెందిన ఉపాధి కూలీ ఛత్రునాయక్ శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. పని చేస్తుండగానే అస్వస్థతకు గురైనటుల ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ నాయక్ తెలిపారు. వెంటనే అతడిని చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనలతో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఏపీఓ నిర్మల ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ


వార్డులో భూమి పూజ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, చైర్మన్ మాబున్నిసాతో కలిసి శుక్రవారం న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. కాల్వలు, పైప్ లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఫయాజ్, కౌన్సిలర్లు, బాసిద్, శ్రీదేవి, మహబూబ్‌వలి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తాం

అసైన్డ్ భూమిని గుర్తించి అర్హులైన పేదలందరికీ పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు పంపిణీ చేస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో జనాభా రోజురోజుకు పెరుగుతుందన్నారు. జనాభా పెరిగే కొద్ది ఉండేందుకు ప్రతి ఒక్కరికీ ఇల్లు అవసరమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు.

కార్యకర్తలకు అండగా లీగల్‌సెల్

- వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ పెద్ది శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ తిమ్మారెడ్డి


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): కార్యకర్తలకు అండగా లీగల్‌సెల్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ పెద్ది శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పేదరిక నిర్మూలనకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు, మృతి చెందిన న్యాయవాదులకు మ్యూచువల్ ఫండ్ కింద రూ.4 లక్షలు కేటాయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యకర్తలపై దాడులు జరపడం, అక్రమ కేసులు బనాయించడంపై కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. త్వరలో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో వార్డులను దత్తత తీసుకుని కేసులకు భయపడాల్సిన అవసరం లేకుండా అండగా ఉంటామన్నారు. అనంతరం నంద్యాల పట్టణ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. లీగల్‌సెల్ పట్టణ అధ్యక్షుడిగా ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షులు జీవీ సుబ్బయ్య, బీవీ కృష్ణారెడ్డి, రామాంజనేయులు, సుబ్బరాయుడు, అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓబులరెడ్డి, కార్యదర్శులుగా అంబేద్కర్, మన్సూర్‌బాషా, అశోక్‌నాయక్, అల్లాబకాష్, శ్రీదేవి, సోహేల్‌రాణా, కోశాధికారిగా వసంతం రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయం నందు లోక కల్యాణం కోసం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ జు మహాసుదర్శన యాగం, సుబ్రహ్మణ్య యాగం కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రతఃకాల పూజలు, మహాసుదర్శన యాగం, సుబ్రహ్మణ్య యాగాలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ బృందం ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోతచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పెళ్లికుమారుడు, కుమార్తెలను పీటలపై ఆశీనులు చేసి శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహాల జియోట్యాగింగ్ విషయంలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈనెలాఖరులోగా హౌస్ మ్యాపింగ్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాలు లేని గ్రామాల్లో వారం రోజుల్లోగా ప్రభుత్వ స్థలాలను వీఆర్ఓల సహకారంతో సేకరించి గ్రామ పంచాయతీలకు అప్పజెప్పేలా చూడాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫనీత్‌క్రిష్ణ, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

మంచుతెరలే పరచుకొని..

తెల్లారింది కానీ పొద్దుపొడవలేదు.. పల్లెల్లో ఇంకా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. జనాలు అంతా బయటకు వచ్చారు. చూస్తే దట్టమైన పొగ మంచు వీధిలైట్లను సైతం కమ్మేసింది. ఉదయం 9 గంటలవుతున్నా భానుడు కనిపించడం లేదు. రోడ్లు సైతం కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేకువజామునే ఆహారం కోసం వెళ్లే పక్షులు సైతం దారి కనిపించక చెట్లమీదనే ఉండసాగాయి. ఓ చిన్నపాటి వర్షం కురవడంతో స్థానికులు మంచును చూసి సంబరపడ్డారు.
– దొర్నిపాడు/ఉయ్యాలవాడ


క్రిష్టిపాడులో కమ్మేసిన మంచుతెరలు


కుందూనదిలో ఉదయం 9 గంటల సమయంలో కురుస్తున్న మంచు


కోవెలకుంట్ల-జమ్మలమడుగు రహదారిలో మంచుతెరల మధ్య జనసంచారం